# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-10-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. హర్యానాలో భారతీయ జనతా పార్టీ సాధించిన విజయం అభివృద్ధి, సుపరిపాలన విజయమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
2. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వివరించి.. తగిన ఆర్థిక సహాయం కోరినట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు.
3. రాష్ట్రంలోని అన్ని పంచాయితీల్లో ఈనెల 14వ తేదీ నుంచి వారం రోజుల పాటు 'పల్లె పండుగ' నిర్వహించనున్నామని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, కె.పవన్ కళ్యాణ్ తెలిపారు.
4. తెలంగాణ విద్యుత్ శాఖలో ఉద్యోగాల భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు.
5. దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఈ రోజు ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు.

==========================

హర్యానాలో భారతీయ జనతా పార్టీ సాధించిన విజయం అభివృద్ధి, సుపరిపాలన విజయమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగించారు. ఇది ప్రజాస్వామ్యం సాధించిన విజయం అని ప్రధానమంత్రి తెలుపుతూ,

వాయిస్ ( 36 సెకన్లు)

ఇది ఇలా ఉండగా హర్యానా, జమ్ముకాశ్మీర్ రాష్ట్ర శాసనసభలకు జరిగిన ఎన్నికల ఫలితాల్లో హర్యానాలో 90 నియోజక వర్గాలకుగానూ భారతీయ జనతా పార్టీ 48 స్థానాల్లో, కాంగ్రెస్ 37, ఇతరులు 5 చోట్ల గెలుపొందాయి. జమ్ముకాశ్మీర్‌లో మొత్తం 90 నియోజక వర్గాలకుగానూ నేషనల్ కాన్ఫరెన్స్ 42 స్థానాల్లో, భారతీయ జనతా పార్టీ 29 స్థానాల్లోనూ ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ 6 చోట్ల గెలుపొందాయి. జమ్ముకాశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్-కాంగ్రెస్ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది.

---

ఢిల్లీలో పర్యటిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిన్న పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి పర్యటనపై ఢిల్లీ కేంద్రం నుంచి అందిన సమాచార వివరాలను

మా ఆకాశవాణి ప్రతినిధి యుగంధర్ అందిస్తారు.

వాయిస్ (30 సెకన్లు)

-------------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామాల్లో అభివృద్ధి పనులను చేపట్టేందుకు రాష్ట్రంలోని అన్ని పంచాయితీల్లో ఈనెల 14వ తేదీ నుంచి వారం రోజుల పాటు 'పల్లె పండుగ' నిర్వహించనున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి 'పల్లె పండుగ" నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, సంబంధిత ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి దృశ్య మాధ్యమ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అనంతపురం జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ పాల్గొన్నారు. దీనిపై మా ఆకాశవాణి అనంతపురం జిల్లా ప్రతినిధి ఎం. మనోహర్ మరిన్ని వివరాలను అందిస్తారు.

వాయిస్ (31 సెకన్లు )

-------------------------------

తెలంగాణ విద్యుత్ శాఖలో ఉద్యోగాల భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, విద్యుత్ శాఖలో పదేళ్లుగా నిలిచిపోయిన పదోన్నతులను చేపట్టామన్నారు. దసరా కంటే ముందుగానే విద్యుత్ సిబ్బందికి బకాయిలను విడుదల చేస్తామని తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రజలు 1912 నంబర్‌కు ఫోన్ చేయాలని మంత్రి సూచించారు.

-------------------------------

విజయవాడ దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఏడవ రోజైన ఈరోజు ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారి జన్మనక్షత్రమైన మూలా నక్షత్రం కావడంతో తెల్లవారుజామున 2 గంటలనుంచే విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. భక్తుల రద్దీ వివరాలను మా ఆకాశవాణి ఎన్టీఆర్ జిల్లా ప్రతినిధి కె.నవీన్ కుమార్ అందిస్తారు.

వాయిస్ ( 39 సెకన్లు)

మరోవైపు తెలంగాణలో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఈరోజు వెన్నముద్దల బతుకమ్మను నిర్వహిస్తున్నారు.

-------------------------------

తెలంగాణలో రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్‌లో నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపే వారి డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేస్తామని, భవిష్యత్తులో వారి పేరిట వాహనాల రిజిస్ట్రేషన్స్ కూడా నిలిపివేస్తామని చెప్పారు. పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వచ్చే నెలలో రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తామని మంత్రి వివరించారు.

-------------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఆహార భద్రత తనిఖీల కోసం ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ–ఎఫ్ఎస్ఎస్ఏఐతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందానికి సంబంధించి మరిన్ని వివరాలు మా ఆకాశవాణి ప్రతినిధి సత్యన్నారాయణ అందిస్తారు.

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్ అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించేలా విజన్ 2047 డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. విజన్ 2047 డాక్యుమెంట్ తయారీలో భాగంగా నిన్న ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంటు సభ్యులు, జిల్లా అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధికి సంబంధించి ప్రజా ప్రతినిధులు వారి నియోజకవర్గాలకు సంబంధించి ప్రణాళికలను వివరించారన్నారు. గ్రానైట్, తీరప్రాంతం వంటి వనరులను సమర్థ వంతంగా వినియోగించుకుని ప్రకాశం జిల్లాను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని మంత్రి తెలిపారు.

=======================